



టెక్కలి : మిల్లు వద్ద ధాన్యం లోడుతో వాహనాలు

బియ్యం కదలట్లే



నరసన్నపేట సివిల్‌సప్లయ్ గోదాం వద్ద బియ్యం బస్తాలు

- మిల్లుల వద్ద భారీగా నిల్వలు
- 'వన్ స్టాగ్'తో అన్‌లోడింగ్‌లో జాప్యం
- గిడ్డంగుల బయటే బస్తాలు
- మందగిస్తున్న ధాన్యం కొనుగోలు

(నరసన్నపేట)

రైతుల నుంచి ధాన్యం కొనుగోలు వేగవంతంగా సాగాలంటే మిల్లర్లు మరపట్టిన బియ్యాన్ని ప్రభుత్వం వెంట వెంటనే తీసుకొని గిడ్డంగులకు తరలించాలి. దీనివల్ల ఆ మిల్లులకు మళ్లీ ధాన్యాన్ని పంపించేందుకు వీలుంటుంది. కానీ, జిల్లాలో ఈ ప్రక్రియ సక్రమంగా జరగడం లేదు. సివిల్ సప్లయ్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా బియ్యం నిల్వలు మిల్లుల్లో పేరుకుపోతున్నాయి. మరోవైపు బ్యాంకు గ్యారెంటీ (బీజీ)లు లేక ధాన్యం కొనుగోలు కూడా మందగిస్తున్నాయి. జిల్లాలో 260 రైస్‌మిల్లులు ఉన్నాయి. ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని బ్యాంకు గ్యారెంటీ(బీజీ)లు ఇచ్చిన మిల్లులకు పంపిస్తుంది. అనంతరం కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) విధానంలో క్వింటా ధాన్యానికి 67 కేజీల బియ్యం మిల్లర్ల నుంచి తీసుకుంటుంది.

మిల్లర్లు మరపెట్టిన బియ్యం సేకరించి సివిల్ సప్లయ్ గిడ్డంగుల్లో నిల్వ చేయాలి. కానీ, జిల్లాలో చాలా మిల్లుల నుంచి బియ్యం తరలింపులో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తు న్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో మిల్లుల వద్ద బియ్యం నిల్వలు భారీగా పేరుకుపోతున్నాయి. మిల్లర్లు పంపించిన బియ్యం మూడు రోజుల వరకు గిడ్డంగుల వద్ద అన్‌లోడింగ్ కావడం లేదు. దీనివల్ల డామరేజ్ పేరిట వాహనాల అద్దె తడిసిమోపుడు అవుతుందని మిల్లర్లు గగ్గోలు పెడుతున్నారు.

సిబ్బంది కొరత

జిల్లాలో నరసన్నపేట, నారాయణవలస, నైర, రావిపాడు, సోంపేట, ఇచ్ఛాపురం, టెక్కలి, పలాస తదితర ప్రాంతాల్లో ఉన్న వేర్‌హౌస్ గిడ్డంగులకు ప్రభుత్వం కస్టమ్స్ బియ్యం తరలిస్తుంది. నరసన్నపేట గిడ్డంగి వద్ద సిబ్బంది కొరత ఉంది. మేనేజర్ పోస్టు ఖాళీగా ఉండగా వాటి బాధ్యతను ఆర్ఎంవో నిర్వహిస్తున్నారు. మరోవైపు నాణ్యతను పరిశీలించే క్వాలీటీ కంట్రోల్ అధికారులకు రెండేసే ప్రాంతాలకు డ్యూటీలు వేస్తున్నారు. దీనివల్ల గిడ్డంగుల వద్ద బియ్యం అన్‌లోడింగ్ మరింత ఆలస్యమవుతోంది. కొన్ని గిడ్డంగుల్లో ఆరుబయటే బియ్యం బస్తాలు ఉన్నాయి.

జాప్యం లేకుండా సేకరిస్తున్నాం

మిల్లుల నుంచి బియ్యం సేకరించేందుకు వే బిల్లులను వెంటనే ఇస్తున్నాం. ఇప్పటికే 11 మంది క్వాలిటీ కంట్రోల్ అధికారులు అందుబాటులో ఉన్నారు. బియ్యం తరలింపును మరింత వేగవంతం చేసేందుకు అదనంగా సిబ్బందిని నియమిస్తాం. నాణ్యతలో రాజీపడడం లేదు. క్వాలిటీ కంట్రోల్ అధికారులు ప్రలోభాలకు లోనైతే విధుల నుంచి తొలగిస్తాం. సీఎంఆర్ విధానంలో ఇప్పటివరకు 25 శాతం మేరకు బియ్యం సేకరించాం.

- కె.శ్రీనివాసరావు, డీఎం, సివిల్‌సప్లయ్ శాఖ

వన్‌స్టాగ్ విధానంతో జాప్యం

సివిల్ సప్లయ్ గిడ్డంగుల్లో వన్ స్టాగ్ విధానంతో బియ్యం అన్‌లోడింగ్‌లో తీవ్ర జాప్యమవుతోంది. గతంలో మిల్లర్లు ఇచ్చిన బియ్యం బస్తాలను అంతా కలిపి ఒకే స్టాగ్ (నిట్టవేయడం)లో ఉంచేవారు. దీంతో మిల్లుల నుంచి లారీల ద్వారా గిడ్డంగులకు వచ్చిన బియ్యం నాణ్యతను క్వాలిటీ కంట్రోల్ అధికారులు పరిశీలించి అన్‌లోడింగ్‌కు అవకాశం ఇచ్చేవారు. గతేడాది నుంచి మిల్లులకు కేటాయించిన గిడ్డంగుల్లో ఒక్కొక్క మిల్లుకు ఒక్కొక్క స్టాగ్ కేటాయించారు. స్టాగ్‌లో ఆరు ఏసీకేలు బియ్యం(సుమారు 3వేల క్వింటాలు) నిట్టకడతారు. దీనివల్ల మూడు నుంచి నాలుగు రోజుల వరకు లారీల్లోని బియ్యం అన్‌లోడింగ్ కావడం లేదు. మరోవైపు మిల్లర్లు ఆన్‌లైన్‌లో ట్రక్కు వివరాల నమోదు చేసే సమయంలో సాంకేతికపరంగా లోపాలు ఏర్పడుతున్నాయి.

ధాన్యం డబ్బులు ఏవీ?

- నత్తనడకన బిల్లుల చెల్లింపు
- రూ.500 కోట్ల మేర బకాయిలు

(టెక్కలి)

ప్రభుత్వ నిబంధనలతో ధాన్యం విక్రయాలకు ఆపసోపాలు పడిన రైతులు ఇప్పుడు బిల్లులు అందకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో 390 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉన్నాయి. వీటిద్వారా డిసెంబరు మొదటి వారం నుంచే అధికా రులు ధాన్యం కొనుగోలు ప్రారంభించారు. ఇప్పటివరకు రూ.మూడు లక్షలు పైచిలుక మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి జిల్లాలోని 260 మిల్లులకు పంపించారు. దీనికి సంబంధించి రైతులకు సుమారు రూ.500 కోట్లు బిల్లులు చెల్లించాల్సి ఉంది. అయితే, కేవలం రూ.150 కోట్లు మాత్రమే రైతుల ఖాతాల్లో జమచేశారు. ఇంకా రూ.500 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. తమ ఖాతాల్లో నగదు జమకాకపోవడంతో సంక్రాంతి ఎలా జరుపు కోవాలని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆర్‌బీకే మొదలుకొని సివిల్ సప్లయ్ యంత్రాంగం వరకు సాంకేతిక సమస్యలతో మోకాలడ్డుతుండడంతో బిల్లుల చెల్లిం పు ఆలస్యమవుతోంది. ఆర్‌బీకేల పరిధిలో సాంకేతిక సిబ్బంది రైతుల పేరిట ఎఫ్‌టీవోలు జనరేట్ చేసినా చెల్లింపులు ప్రక్రియ నత్తనడకన సాగుతుంది. కొంతమంది రైతుల ఖాతాల్లో జమైనా కొన్ని బ్యాంకులు రోజుకి రూ.30వేలు మాత్రమే విత్‌డ్రా చేసేందుకు అవకాశం ఇస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై సివిల్ సప్లయ్ శాఖ డీఎం కె.శ్రీనివాస్ వివరణ కోరగా.. 'ఇప్పటివరకు జిల్లాలో మూడు లక్షల మెట్రిక్ టన్నులకుపైగా ధాన్యం కొనుగోలు చేశాం. రైతుల బిల్లుల చెల్లింపునకు 21 రోజుల పాటు అవకాశముంది. పెండింగ్ బిల్లులు వారం రోజుల్లో రైతుల ఖాతాల్లో జమయ్యేటట్టు చూస్తాం.' అని తెలిపారు.

టెక్కలి మండలం నర్సింగపల్లి రైతుభరోసా కేంద్రం పరిధిలో 216 మంది రైతుల నుంచి 13 వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు. ఇందుకు సంబంధించి 250 ట్రక్ సీట్లను సాంకేతిక సిబ్బంది అందించారు. అయితే, ప్రభుత్వం కేవలం 20 మంది రైతులకే ధాన్యం బిల్లులు అం దించింది. మిగతా 230 మంది రైతులు ధాన్యం డబ్బుల కోసం ఎదురు చూస్తున్నారు.

బూర్జలో కూడా..

బూర్జ: మండలంలో మూడు రైసు మిల్లులు ఉండగా, వీటిలో రెండు మిల్లులకు బ్యాంక్ గ్యారెంటీలు లేవు. డొంకలపర్తిలో ఉన్న మిల్లుకే బ్యాంకు గ్యారెంటీ ఉండడంతో ధాన్యం తరలించేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. గార మండలంలోని మిల్లులకు ఇక్కడి నుంచి ధాన్యం తరలించేందుకు ట్రావెలింగ్ చార్జీలు ఎక్కువ మొత్తంలో చెల్లించాల్సి వస్తోంది. బ్యాంకు గ్యారెంటీలు, సాంకేతిక సమస్యలు, చివరి గింజ వరకు ధాన్యం కొంటాం, దళారుల ప్రమేయం లేకుండా చూస్తామని ప్రభుత్వం హామీలు క్షేత్రస్థాయిలో కానరావడం లేదు. జనవరి వచ్చినా నేటికీ పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరుచుకోలేదు. దీంతో రైతులు దళారులకు అమ్ముకొనే పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది వరికి సాధారణ రకానికి రూ.2,183, గ్రేడ్-ఏ రకానికి రూ.2,203 మద్దతు ధర ప్రకటించింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

విక్రయాలకు రైతుల పాట్లు

సరుబుజ్జిలి: మండల రైతులు ధాన్యం విక్రయాలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 50కిలోమీటర్ల దూరంలోని శ్రీకూర్మం, గార, ఒప్పంగి, శ్రీకాకుళంలోని రైస్ మిల్లులకు ట్రక్ షీట్లు వస్తున్నాయి. సుదూర ప్రాంతాలకు ధాన్యం తీసుకెళ్తున్న వాహనాలకు సకాలంలో జీపీఎస్ నమోదు కాకపోవడంతో ఇబ్బందిపడుతున్నారు. ఈ నెల 4న సరుబుజ్జిలి రైతు భరోసా కేంద్రం నుంచి ఐదు ట్రాక్టర్లు ధాన్యం బస్తాలతో వివిధ మిల్లులకు వెళ్లి జీపీఎస్ నమోదు కాకపోవడంతో తిరిగి గ్రామాలకు చేరుకున్నాయి.

ఆదిత్యుని సాక్షిగా సామూహిక సూర్యనమస్కారాలు

అరసవల్లి, జనవరి 8: అరసవల్లిలోని ఇంద్రపుష్కరిణి సమీపంలో వైజయంతి ఉత్సవ వేదిక వద్ద సోమవారం సామూహిక సూర్యనమస్కారాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆయుష్ సీనియర్ వైద్యుడు డాక్టర్ జగదీష్ మాట్లాడుతూ.. యోగా ద్వారా అందరికీ ఆరోగ్యం సాధ్యమన్నారు. సూర్యనమస్కారాలు నిత్యం సాధన చేస్తే మానసిక సమతుల్యత, ఆరోగ్యం లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో యోగా గురువు రామారావు, బోధకుడు వాసుదేవరావు సూచన మేరకు వందలాది మంది సూర్యనమస్కారాలు చేశారు. అనంతరం ఆయుర్వేద, యునాని, హోమియో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. 476 మందికి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో హార్ట్‌ఫుల్‌నెస్ జోనల్ కోఆర్డినేటర్ కె. లక్ష్మణరావు, వైద్యాధికారులు డాక్టర్ సీతామహాలక్ష్మి, డాక్టర్ మహతి, డాక్టర్ ప్రసన్న లక్ష్మి, డాక్టర్ పూజారి పురుషోత్తం, ఎం.సోమశేఖర్, పతంజలి యోగా సెంటర్ ప్రతినిధి చిన్నబాబు, స్వాతి, ఎంవీ.నాగేశ్వరరావు, ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధి వి.సుధారాణి, ఆయుష్ మెడికల్, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.



యోగా సాధన చేస్తున్న దృశ్యం

విశాఖ రేంజ్‌లో 28 మంది సీఐల బదిలీ

విశాఖపట్నం/శ్రీకాకుళం క్రైం, జనవరి 8: విశాఖ రేంజ్‌లో 28 మంది సర్కిల్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ ఐజీ హరికృష్ణ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. నాలుగు నెలల్లో ఎన్నికలు జరగనున్నందున ఒకే చోట మూడేళ్లకు మించి పనిచేస్తున్న సీఐలను మార్చారు. సొంత జిల్లాల్లో ఉండకూడదన్న ఎన్నికల కమిషన్ ఆదేశాలను కూడా పరిగణనలోకి తీసుకున్నారు. తాజా బదిలీల్లో విశాఖ రేంజ్‌లో వేకెన్సీ రిజర్వులో ఉన్న సీఐలు జి.దుర్గాప్రసాద్, ఎస్.విద్యాసాగర్, సీహెచ్ ప్రసాద్, టి.సీతారామ్, సీహెచ్ శ్రీనివాసరావు, పి.శోభన్ బాబును విశాఖ నగరానికి కేటాయించారు. పి.రంగనాథాన్ని విజయనగరం ట్రాఫిక్‌కు, పీవీ జగన్నాథరాజును విజయనగరం జిల్లా వీఆర్‌కు బదిలీ చేశారు. విజయనగరం రూరల్ సీఐ టీవీ తిరుపతిరావు, శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం సీఐ ఆర్ఈసీహెచ్ ప్రసాద్, శ్రీకాకుళం రెండో పట్టణ సీఐ పి.శ్రీనివాసరావు, శ్రీకాకుళం జిల్లాలో వేకెన్సీ రిజర్వులో ఉన్న ఎస్.రామకృష్ణను విశాఖ నగరానికి కేటాయించారు. ఇక విశాఖ నగరంలో పనిచేస్తున్న బి.రమణమూర్తిని శ్రీకాకుళం జిల్లా వేకెన్సీ రిజర్వుకు, కె.రామారావును విజయనగరం రెండో పట్టణ సీఐగా, జి. సోమశేఖరాన్ని శ్రీకాకుళం డీసీఆర్‌బీకి, జి.ఉమామహేశ్వరావును శ్రీకాకుళం టూటౌన్ సీఐగా, జి. నిర్మలను శ్రీకాకుళం డీటీసీకి, కె.అశోక్‌కుమార్‌ను విజయనగరం ట్రాఫిక్ సెల్‌కు, టీవీ విజయకుమార్‌ను విజయనగరం జిల్లా సోషల్ మీడియా సెల్‌కు, ఎం. అప్పారావును పార్వతీపురం మన్యం జిల్లా సీసీఎస్‌కు, బీఎండీ ప్రసాద్‌ను పార్వతీపురం మన్యం సోషల్ మీడియా సెల్‌కు బదిలీ చేశారు. శ్రీకాకుళం టాస్క్‌ఫోర్స్ సీఐ టి.ఇమ్మాన్యుయల్‌రాజును ఇచ్ఛాపురం సీఐగా నియమించి, ఆయన స్థానంలో అక్కడి డీసీఆర్‌బీ సీఐ సీహెచ్ సూరినాయుడుకు పోస్టింగ్ ఇచ్చారు. అనకాపల్లి జిల్లా పరవాడ సీఐ పి.ఈశ్వరరావును శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ సీఐగా నియమించి, అక్కడ పనిచేస్తున్న జి.శంకరరావును అనకాపల్లి టౌన్ సీఐగా, అనకాపల్లి ట్రాఫిక్ సీఐ టి.శ్రీనివాసరావును శ్రీకాకుళం జిల్లా సోషల్ మీడియా సెల్‌కు, విజయనగరం రెండో పట్టణ సీఐ ఎన్‌హెచ్‌వీ ఆనంద్‌ను కాశీబుగ్గ పట్టణ యూపీఎస్‌కు, అక్కడ పనిచేస్తున్న డి.నవీన్‌కుమార్‌ను అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు యూపీఎస్ సీఐగా పోస్టింగ్ ఇస్తూ ఐజీ ఉత్తర్వులు జారీచేశారు.



శ్రీకాకుళంలో రిలే నిరాహార దీక్ష చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన

పట్టు సడలించం.. దీక్ష విరమించం

- అంగన్‌వాడీ కార్యకర్తల సమ్మె 28వ రోజుకు చేరుకుంది. అయినా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో మూడు రోజులుగా కలెక్టరేట్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం తెచ్చిన అత్యవసర సర్వీసుల చట్టం ఎస్మాకు ఏమాత్రం భయపడకుండా.. పోరాటం సాగిస్తున్నారు. సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె విరమించేది లేదని స్పష్టం చేశారు. కార్య క్రమంలో అంగన్‌డీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.కళ్యాణి, కె.ప్రమీలాదేవి, టి.రాజేశ్వరి పాల్గొన్నారు.

- కొనసాగుతున్న సమగ్రశిక్ష ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తల నిరసనలు
- కలెక్టరేట్ వద్ద మునిసిపల్ కార్మికుల ధర్నా
- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న మునిసిపల్ కార్మికులు

అరసవల్లి/కలెక్టరేట్, జనవరి 8: సమస్యల పరిష్కారం, హామీల అమలు కోరుతూ.. సమగ్ర శిక్ష ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మునిసిపల్ కార్మికుల నిరసనలు కొనసాగుతూనే ఉన్నాయి. పట్టు సడలకుండా.. దీక్ష విరమించకుండా.. రోజుల తరబడి ఆందోళనలు చేపడుతూనే ఉన్నారు. శ్రీకాకుళం కలెక్టరేట్ సమీపంలోని జ్యోతిబాపూలే పార్కు వద్ద సమగ్ర శిక్ష ఉద్యోగులు నిర్వహిస్తున్న సమ్మె సోమవారానికి 20వ రోజుకు చేరుకుంది. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని సమగ్రశిక్ష ఉద్యోగుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు పైడి మురళీకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 20 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. సీఎం జగన్ ఇచ్చిన హామీలు అమలుచేయాలని కోరారు. ఉద్యోగులందరికీ హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, పెండింగ్ జీతాలను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కోశాధికారి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి తవిటినాయుడు, ఉపాధ్యక్షుడు పోతయ్య రాము, యుగంధర్, నరసింగరావు, శైల జ, అరుంధతి, ఉషాబాల, అరుణకుమారి, జ్యోతి, నాగమణి, శశిరేఖ, రామినాయుడు, చంద్రశేఖర్, ధనుంజయ, చిరంజీవి పాల్గొన్నారు.

- మునిసిపల్ కార్మికులు సోమవారం శ్రీకాకుళం కలెక్టరేట్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. మునిసిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు అరుగుల గణేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. 14 రోజులుగా సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వం మొక్కుబడి చర్చలతో కాలయాపన చేస్తోందని ఆరోపించారు. పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు మునిసిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు డి.యుగంధర్, డి.చిట్టిబాబు, అరుగుల రాము, సీహెచ్ మురుగన్, పి.బాలకృష్ణ, బి.భాస్కరరావు, అరుగుల లక్ష్మి, జయ, మాధవి, టి.వెంకటలక్ష్మి, బి.స్వప్న, ఏ.శేఖర్, ఆర్జి గణేష్, జె.రమేష్, బి.సరోజ పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం: పురుషోత్తపురం ఉన్నత పాఠశాలలో సంక్రాంతి వేడుకలు

ముందస్తు సంక్రాంతి సందడి

- పాఠశాలల్లో ఘనంగా సంబరాలు

హిరమండలం/ ఇచ్ఛాపురం/ వజ్రపుకొత్తూరు, జనవరి 8 : ప్రభుత్వ పాఠశాలల్లో ముందుగానే సంక్రాంతి సందడి నెలకొంది. రుగడ, సవర చొర్లంగి, కొమనాపల్లి, కిట్టాలపాడు, పురుషోత్తపురం, పెదవంక, అక్కుపల్లి తదితర పాఠశాలల్లో సోమవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. చిన్నారులు సంప్రదాయ దుస్తులతోపాటు వివిధ వేషధారణలతో ఆకట్టుకున్నారు. పాఠశాలల ఆవరణలో బోగి మంటలు వేసి.. డూడూ బసవన్నలతో సందడి చేశారు. సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించేలా వేడుకలు చేసుకున్నారు.



హిరమండలం : కిట్టాలపాడులో ఆకట్టుకున్న విద్యార్థుల వేషధారణ



వజ్రపుకొత్తూరు : పెదవంక పాఠశాలలో..



నరసన్నపేట: మాట్లాడుతున్న బగ్గు రమణమూర్తి


పాతపట్నం: మాట్లాడుతున్న కలమట వెంకటరమణమూర్తి


పలాస: మాట్లాడుతన్న టీడీపీ నాయకులు

దళారులకు ధాన్యం విక్రయం

● పచ్చని రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు ● ఆందోళన వ్యక్తంచేసిన టీడీపీ నాయకులు

రైతు అప్పుల్లో రాష్ట్రం ప్రథమస్థానంలో ఉందని, వారు పండించే ధాన్యం కొనుగోలు లేక మిలర్లు, దళారులకు చౌకగా విక్రయించాల్సివస్తోందని తెలుగుదేశం పార్టీ నాయకులు ఆందోళన వ్యక్తంచేశారు. సోమవారం జిల్లాలో పలుచోట్ల టీడీపీ నాయకులు విలేకరులతో మాట్లాడుతూ మద్దతుధర, సబ్సిడీలు లేక రైతులు దిగాలుగా ఉన్నారని తెలిపారు.

175 సీట్లు మార్చినా వైసీపీ గెలిచేదిలేదు: శిరీష

పలాస: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు ఏపీ హేట్స్ జగన్ అంటున్నారని, 175 స్థానాల్లోనూ వైసీపీ అభ్యర్థులను మార్చినా ఒక్క సీటుకూడా దక్కదని టీడీపీరాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష తెలిపారు. సోమవారం పలాసలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రం జగన్ వల్ల సర్వనాశనమయ్యిందని, పచ్చని రాష్ట్రంలో ప్రతిరోజూ రైతుల ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. రివర్స్ టెండర్లు పేరుతో అభివృద్ధి పనులు భ్రష్టు పట్టించారని, చంద్రబాబు హయాంలో పోలవరం 73 శాతం పూర్తి చేస్తే తట్టెడు మట్టి కూడా వైసీపీ ప్రభుత్వం వేయలేకపోయిందని, పైగా వారి మంత్రులు నీతివ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. విద్యుత్ చార్జీలు, మద్యం ధరలు పెంచారని, చివరకు చెత్తపై కూడా పన్నువేసి సామాన్యుడికి ఇబ్బందులు పెట్టారని ఆందోళన వ్యక్తం చేశారు.

నియోజకవర్గంలో సాధించిన ఘనకార్యం ఏమిటో

పలాస నియోజకవర్గంలో రైతుబజారు, కాశీబుగ్గ ఫ్లైఓవర్ బ్రిడ్జి, ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పూర్తిచేయలేని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు తమ నాయకులు చంద్రబాబునాయుడు, లోకేష్‌ను విమర్శిస్తున్నారని, వాస్తవానికి నియోజకవర్గంలో సాధించిన ఘనకార్యాలేఏమిటో ప్రజలకు చెప్పాలని తెలుగుదేశం పార్టీ నాయకులు సవాల్‌విసిరారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, జిల్లా కార్యదర్శి పీరుకట్ల విఠల్‌రావు, రాష్ట్ర బీసీసెల్ కార్యదర్శి లొడగల కామేశ్వరరావుయాదవ్‌లు విలేకర్లతో మాట్లాడారు. అప్పలరాజు వ్యాఖ్యలపై అభ్యంతరాన్ని వ్యక్తంచేశారు. టీడీపీ హయాంలో జరిగిన పనులకే మళ్లీ శంకుస్థాపనచేసి తమ పనులుగా చెప్పుకున్న ఘన చరిత్ర అప్పలరాజుకు ఉందన్నారు.సమావేశంలో టీడీపీ నా యకులు గురిటి సూర్యనారాయణ, టంకాల రవిశంకర్‌గుప్తా, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, జనసేన నాయకుడు ఆట్టాడ వాసు, దువ్వాడ సంతోష్, అంబటి కృష్ణమూర్తి, శంకర్, జోగ మల్లేశ్వరరావు, దడియాల నర్సింహులు పాల్గొన్నారు.


వజ్రపుకొత్తూరు: మాట్లాడుతున్న టీడీపీ మత్స్యకార నాయకులు

టీడీపీ హయాంలోనే మత్స్యకారులకు గుర్తింపు

వజ్రపుకొత్తూరు: టీడీపీ ప్రభుత్వ హయాంలోనే మత్స్యకారులకు తగిన గుర్తింపు లభించించిందని పార్టీమండల మత్స్యకార నాయకులు పేర్కొ న్నారు. వజ్రపుకొత్తూరులో నాయకులు సూరాడమోహనరావు, ఆకుల పాపారావు విలేకరులతో మాట్లాడారు. ఇటీవల మంత్రి అప్పలరాజు చంద్రబాబునాయుడ్ని, టీడీపీని విమర్శించడాన్ని వారు తప్పుపట్టారు. చంద్రబాబును విమర్శించే స్థాయి మంత్రి అప్పలరాజుకు లేదని పేర్కొన్నారు. నువ్వలరేవు వద్ద ఫిష్‌ల్యాండింగ్ పనులు నాలుగేళ్ల నిలిపోయినా మంత్రి అప్పలరాజు కనీ సం స్పందించకుండా టీడీపీని,చంద్రబాబును విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. తమ హయాంలో తీరప్రాంతగ్రామాలలో జరిగిన అభివృద్ధిని తెలుసుకొని మాట్లాడాలన్నారు. సమావేశంలో టీడీపీ మండల ఉపాధ్యక్షుడు అర్సవెల్లి ఉమామహేశ్వరరావు, మాజీ ఎంపీటీసీలు ఆనంద్, వెంకటేష్, మురుపింటి నారాయణ, గోవిందు, శాంతారావు, తిరుపతిరావు పాల్గొన్నారు.

రోజుకు ముగ్గురు రైతుల ఆత్మహత్య: బగ్గు

నరసన్నపేట: రైతులు పండించే ధాన్యం సక్రమంగా కొనుగోలు చేయకపోవడంతో గ్రామాల్లో దళారులకు విక్రయిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి ఆరోపించారు. నరసన్నపేట పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ అన్నపూర్ణగా పేరుగాంచిన ఆంధ్రరాష్ట్రాన్ని వైసీపీ పాలకులు దరిద్రరాష్ట్రంగా మార్చివేశారని ధ్వజమెత్తారు. పచ్చని రాష్ట్రంలో రోజుకు ముగ్గురు రైతులు ఆత్మహత్యచేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కాలువల్లో పూడిక తీయకపోవడంతో రైతులు అవస్థలకు గురవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు శిమ్మ చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి అడపా చంద్రశేఖర్, గొద్దు చిట్టిబాబు, కింజరాపు రామారావు, దామోదర నర్సింహులు పాల్గొన్నారు.

మూలకుచేరిన వ్యవసాయం: కలమట

పాతపట్నం: జగన్ నిర్లక్ష్యవైఖరితో వ్యవసాయరంగం మూలకు చేరిందని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణమూర్తి ఆరోపించారు.పాతపట్నంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీపై పార్టీ శ్రేణులతో సమీక్షించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ హార్టీకల్చర్ రోడ్డున పడిందన్నారు. రైతులు ఎండించేపంటను అమ్ముకోలేని దుస్థితిలో ఉన్నాడన్నారు. పోలవరం ప్రాజెక్ట్, వంశధార కాలువ పనులు ఎక్కడవేసిన గొంగలి అక్కడే అన్నచందాన ఉండిపోయాయన్నారు.నాగావళి-వంశధార అనుసంధానం మరిచిపోయా రన్నారు. కౌలు రైతుల ఆత్మహత్యల విషయంలో రెండో స్థానంలో, రైతుల ఆత్మ హత్యల్లో మూడోస్థానంలోనూ ఉందన్నారు. సమావేశంలో పార్టీ బీసీసెల్ రాష్ట్ర పాధ్యక్షుడు పైల లక్ష్మయ్య, పట్టణాధ్యక్షుడు సైలాడ సతీష్, క్లస్టర్ ఇన్‌చార్జి అక్కుంద్ర సన్యాసిరావు, దుర్గారావు, రేగేటి రమణ పాల్గొన్నారు.


ఇచ్ఛాపురం: కరపత్రం అందజేస్తున్న లీలారాణి


పొందూరు: బాబు ష్యూరిటీలో టీడీపీ నాయకులు


నరసన్నపేట: బొడ్డవలసలో...


సారవకోట మండలంలోని రామచంద్రాపురంలో..

బాబుతోనే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు

●బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో పార్టీ నాయకులు కరపత్రాల పంపిణీ

టీడీపీ అధినేత చంద్రబాబునాయుడును సీఎంగా చేయడం వల్ల రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఆ పార్టీ నాయకులు తెలిపారు. సోమవారం జిల్లాలో బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు ఇంటింటికి వెళ్లి వైసీపీ అరాచకాలు, చంద్రబాబు అక్రమ అరెస్టు గురించి ప్రజలకు వివరించి, కరపత్రాలు పంపిణీచేశారు.


ఆమదాలవలస: మునిసిపాలిటీలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు


పాతపట్నం: పెద్దమల్లిపురంలో బాబు ష్యూరిటీ-బాబు గ్యారెంటీ కార్యక్రమం కరపత్రాలు అందజేస్తున్న కలమట సాగర్

● **నరసన్నపేట:** వైసీపీ పాలనలో పేదలకు దగా చేశారని టీడీపీ పట్టణాధ్యక్షుడు కింజరాపు రామారావు ఆరోపించారు. నరసన్నపేటలోని బొడ్డవలసలో బాబుష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీకార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గొద్దు చిట్టిబాబు, రావాడ గణపతి, కూన రమేష్ పాల్గొన్నారు.

●**జలుమూరు (సారవకోట):** యువత భవిష్యత్తు బాగుపడాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని సారవకోట మండల టీడీపీ అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ తెలిపారు. సారవకోట మండలంలోని రామచంద్రాపురంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి సాదు చిన్నికృష్ణంనాయుడు, మాజీ సర్పంచ్ బోర తాతయ్య, టిడిపి నాయకులు కె.అప్పారావు, దండుపాటి రాజారావు పాల్గొన్నారు.

●**పాతపట్నం:** రాష్ట్రంలో కక్షసాధింపులు, పదవీపరిరక్షణే లక్ష్యంగా వైసీపీ పాలన సాగిందని టీడీపీ రాష్ట్రకార్యదర్శి కలమట సాగర్ ఆరోపించారు. మండలంలోని పెద్దమల్లిపురంలో బాబుష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ రాష్ట్రఉపాధ్యక్షుడు పైల లక్ష్మయ్య మాజీసర్పంచ్ గొర్లె ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

● **పొందూరు:**పొందూరులో టీడీపీ నేతలు బాబు ష్యూరిటీ- భవి ష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. వాండ్రంగివీధిలో ఇంటింటికి వెళ్లి టీడీపీ మేనిఫెస్టోపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు రామ్మోహన్, నాయకులు అన్నెపురాము, శంకర భాస్కర్, కె.శ్రీనివా సరావు, కె.శాంతారాం, పాపారావు, ఎస్.రమణ తదితరులు పాల్గొన్నారు.

● **ఇచ్ఛాపురం:** పురపాలక సంఘ పరిధి 11వ వార్డు కస్పావీధిలో కౌన్సిలర్ ఆశి లీలారాణి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ- భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. సోమవారం వార్డులో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు.

● **ఆమదాలవలస:** టీడీపీతోనే రాష్ట్రానికి పూర్వ వైభవం సాధ్యమని ఆ పార్టీ బీసీ సెల్ కార్యదర్శి బోర గోవిందరావు అన్నారు. సోమవారం ఆమదాలవలస మున్సిపాలిటీలోని 10, 49, 50 వార్డుల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందరంగా టీడీపీ శ్రేణులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాడ విజయ్‌కుమార్, నాగళ్ల మురళీధర్, జి.సింహాద్రి, జి.కరుణ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ విజేత పూండి

వజ్రపుకొత్తూరు: బెంగళూరులో జరిగిన వాలీబాల్ పోటీల్లో పూండికి చెందిన సచిన్ స్పోర్ట్స్ జట్టు విజేతగా నిలిచినట్లు సచిన్ స్పోర్ట్స్ అధినేత నందికి ధనరాజ్ చెప్పారు. జాతీయ స్థాయిలో జరిగిన ఈ పోటీల ఫైనల్‌లో బెంగళూరుతో తలపడి 3-1 తేడాతో విజయం సాధించినట్లు చెప్పారు.జట్టులో జిల్లాకు చెందిన విజయ్‌కుమార్, ఎం.తరుణ్ ఉన్నారు. కాగా జట్టు కోచ్‌గా జి.రామస్వామి సేవలందించారు.

నీలమణి దుర్గ ఆలయ హుండీ లెక్కింపు

పాతపట్నం: పాతపట్నంలోని నీలమణిదుర్గఆలయానికి 55రోజులకు రూ3,98,599 ఆదాయం లభించినట్లు ఈవో వాసుదేవరావు తెలిపారు. దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కార్యాలయప్రతినిధి జీవీబీఎస్ రవికుమార్ పర్యవేక్షణలోఆలయంలోని ధర్మహుండీలను సోమవారం లెక్కించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి ఛైర్మన్ నూలు ఈశ్వరరావు, సభ్యులు సవిరిగాన కృష్ణారావు, నేతాజి, అర్చకులు రాజేష్ పాల్గొన్నారు.

గ్రామాల్లో భూముల రీసర్వే సభలు

నందిగాం: మండలంలోని దేవుపురం, దేవాడ, బంజీరుపేట, దొడ్లరామచంద్రాపురం తదితర గ్రామాల్లో సోమవారం భూములు రీసర్వే గ్రామసభలు నిర్వహించారు. రైతులు అధికారులకు పూర్తి సహకారం అందించి తమ వివరాలను అందించాలని తహసీల్దార్ వైవీ పద్మావతి, మండల సర్వేయర్ కె.జోగారావులు సూచించారు. సభల్లో ఎంఆర్‌ఐ పి.కిరణ్, గ్రామ సర్వేయర్లు యు.రామారావు, గోవింద్, వీఆర్వోలు దేవేంద్రరావు, అనంతరావు పాల్గొన్నారు.

బాలల హక్కులపై చైతన్యం అవసరం

నందిగాం: బాలల హక్కులపై ప్రతి ఒక్కరూ చైతన్యం కలిగి ఉండాలని బాలల హక్కుల కమిషన్ జిల్లా కౌన్సిలర్ ధర్మాన సీతారాములు తెలిపారు. సోమవారం దేవళభద్ర ఉన్నతపాఠశాలను సందర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం డి.పూర్ణిమ, కన్సల్టెంట్ ఎస్.వైకుంఠరావు, ఎస్‌వీ అనీల్‌కుమార్ పాల్గొన్నారు.

సికిల్‌సెల్ ఎనీమియాపై సమావేశం

నందిగాం: స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో సోమవారం సికిల్‌సెల్ ఎనీమియాపై సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో టి.రాజారావు అధ్యక్షతన నందిగాం, నౌగాం పీహెచ్‌సీ వైద్యాధికారులు కె.అనితకుమారి, పి.అంజలి నేతృత్వంలో కార్యదర్శులకు, ఆరోగ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. నవరకొత్తూరు, బెనియావూరు, కామదేనుపుతదితర గ్రామాల్లో పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారులు తెలిపారు. సమావేశంలో ఈవో పి.సూర్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

స్వస్థలాలకు చేరుతున్న వలస జీవులు

● ప్రయాణికులతో కిక్కిరిసిపోయిన పలాస రైల్వే స్టేషన్


పలాస రైల్వే స్టేషన్ వెలుపల ప్రయాణికుల రద్దీ

పలాస:సంక్రాంతికి వలసజీవులు స్వస్థలాలకు చేరుతున్నారు. ఉద్దానం ప్రాంతం, నందిగాం, మెళియాపుట్టి తదితర మండలాల్లోని పలు గ్రామాల ప్రజలు ఉపాధి కోసం వివిధ ప్రాంతాలకు వలస వెళ్లిన వారంతా రైళ్లు, బస్సుల్లో వస్తున్నారు. భువనేశ్వర్, విశాఖ, విజయవాడ, దుర్గ్ వంటి ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా ఇళ్లకు వస్తుండడంతో పలాస రైల్వేస్టేషన్ సోమవారం కిటకిటలాడింది. పలాస రైల్వేస్టేషన్‌లో సాధారణంగా ప్రతిరోజూ ఐదువేల మంది తమ గమ్యస్థానాలు చేరుతుంటారు. సంక్రాంతికావడంతో ఆ సంఖ్య రెట్టింపయ్యింది. రైల్వేశాఖ ప్రయాణికులకోసం సికింద్రాబాద్,కోల్‌కటా, చెన్నై, బెంగళూరు ప్రాంతాల నుంచి ప్రత్యేక రైళ్లు వేయడంతో ప్రజలు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. రైళ్లు దిగిన వారి బంధువులు స్టేషన్‌కు రావడంతో తెల్లవారి నుంచే సందడి నెలకొంది. కొందరు సొంతంగా వాహనాలుఏర్పాటు చేసుకోగా, మరికొందరు ఆటోల్లో స్వస్థలాలకు వెళ్తున్నారు.

ఇంటిబాట పట్టిన విద్యార్థులు


నందిగాం బాలికల గురుకులం నుంచి ఇళ్లకు బయలుదేరిన విద్యార్థినులు

నందిగాం: పాఠశాలలకు సంక్రాంతి సెలవులు మంగళవారం నుంచి ప్రకటించడంతో విద్యార్థులు ఇంటిబాట పట్టారు. నందిగాం అంబేడ్కర్ బాలికల గురుకులం, మదనాపురం కేజీబీవీ, ఐటీడీఏ ఆశ్రమ పాఠశాలలు, స్థానిక బీసీ వసతిగృహ విద్యార్థులు ఇళ్లకు తల్లిదండ్రులు సహాయంతో చేరుతున్నారు. ఈనెల 18 వరకు సంక్రాంతి సెలవులు ప్రకటిస్తున్నట్లు ఎంఈవో జి.నర్సింహులు, ఎ.చిన్నారావు తెలిపారు.● **పోలాకి:** గంగివలస కస్తూర్బా, ఈదులవలస ఆదర్శపాఠశాల, ప్రియాగ్రహారం, పోలాకి, కోడూరు హాస్టళ్ల విద్యార్థులు కూడా ఇంటిముఖం పట్టారు.

ఏపీటీఎఫ్ విద్యాసదస్సు విజయవంతం చేయండి

మందస: విజయవాడలో ఈనెల 11న నిర్వహించే ఏపీటీఎఫ్ రాష్ట్రస్థాయి విద్యాసదస్సు విజయవంతం చేయాలని ఆ సంఘ జిల్లా ఉపాధ్యక్షులు జి.భీమారావు కోరారు. సోమవారం మందస మండలంలోని పలు పాఠశాలల్లో వినతిపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జాతీయ విద్యావిధానం, రాష్ట్ర విద్యారంగం స్థితిగతులను చర్చించనున్నట్లు తెలిపారు.

'పీఎం జన్‌మన్'తో అభివృద్ధికి కృషి

మందస: ప్రధానమంత్రి ఆదివాసీ న్యాయ మహా అభియాన్(పీఎంజన్‌మన్) కార్యక్రమం ద్వారా కేంద్ర ప్రభుత్వం ఆదివాసీ గ్రామాలకు మౌలిక వసతులు కల్పించి సంపూర్ణ అభివృద్ధికి కృషి చేస్తుందని పలాస నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త డాక్టర్ దుర్గారావు తెలిపారు. ఈ మేరకు సోమవారంమందస మండలంలోని పెండంగో,కళింగనగర్, కోస్టా, చినకోస్టా, బలియాడ, తాళ్లగురంటి గ్రామాల్లో ఆయన పర్యటించి గిరిజనులతో మాట్లాడారు.కార్యక్రమంలో దిలీప్‌కుమార్‌పాణిగ్రాహి, జి.దినేష్‌కుమార్, బి.చంద్రశేఖర్, గేదెల రమణ, లోకనాథం పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఎంఈవోల హామీ


ఎంఈవోలతో చర్చిస్తున్న యూటీఎఫ్ నాయకులు

టెక్కలి:ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి ఎంఈవోలు తులసిరెడ్డి, చిన్నారావులు హామీఇచ్చారు. యూటీఎఫ్ ఇటీవల ఇచ్చిన వినతిపత్రంపై స్పందిస్తూ సోమవారం సంఘ సభ్యులతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ సంఘ నాయకులు ఇచ్చిన కొన్ని సమస్యలను పరిష్కరించామని, మిగతా సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఉపాధ్యాయ సంఘాలతో సమన్వయ సమావేశం నిర్వహించి,సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని, అందరు కలిసి విద్యాభివృద్ధికి మంచి నిర్ణయాలు తీసుకుందామని సూచించారు. సమావేశంలో సంఘ ప్రతినిధులు కె.దాలయ్య, పి.గణపతిరావు, టి.వైకుంఠరావు, ఎస్.కుమారస్వామి, పి.ధర్మారావు, లక్ష్మీనారాయణ, బి.ఖగేశ్వరరావు పాల్గొన్నారు.

మాకయ్యకు ఘన నివాళి

నరసన్నపేట: ఇటీవల మృతిచెందిన ప్రముఖ వ్యాపారి తంగుడు మాకయ్య వర్ధంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పలువురు నాయకులు, వ్యాపారులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పట్టణంలో నిజాయితీగా వ్యాపారానికి మాకయ్య నిలువెత్తు నిదర్శనమని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు.కార్యక్రమంలో బంగారం వర్తకుల సంఘ నాయకులు, వివిధ రాజకీయపార్టీ నాయకులతో పాటు మాకయ్య కుమారులు శ్రీధర్, రమాధర్, గిరిధర్ పాల్గొన్నారు.

పాత పింఛన్ అమలు చేయాలి

●పలాసలో శ్రామిక్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా



పలాస రైల్వేస్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న శ్రామిక్‌యూనియన్ నాయకులు

పలాస: రైల్వేశాఖలో కొత్తగా నియమిస్తున్న ఉద్యోగులకు పాత పింఛన్ విధానాన్నే అమలు చేయాలని శ్రామిక్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పలాస రైల్వే స్టేషన్ ఆవరణలో ఆ సంఘం ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ జనరల్ సెక్రటరీ మట్ట రామకృష్ణ, బ్రాంచ్ అధ్యక్షుడు పీవీవీఎన్ రావు, ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కొత్త పింఛన్ వల్ల ఉద్యోగులు అన్ని విధాలా నష్టపోతారని తెలిపారు.ఆలిండియా రైల్వే ఫెడరేషన్ నేతృత్వంలో గత ఏడాది నుంచి దశలవారీగా ఉద్యమాలు జరుగుతున్నా రైల్వేశాఖ అధికారులు స్పందించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. రైల్వేశాఖ దిగివచ్చి పాత పింఛన్ పునరుద్ధరించేంతవరకూ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బి.గాంధీ, కామేశ్వరరావు, ఎండీవీ రమణ, ఎల్.వెంకటరావు, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

'ప్రభుత్వ తీర్మానంతో గిరిజనులకు అన్యాయం'

మందస: నకిలీబెంతొరియా, మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు ప్రభుత్వం తీర్మానం చేసిందని మందస మండల ఆదివాసీ వికాస్‌పరిషత్ సంఘ సభ్యులు గణేశ్వరరావు, డొంబురు, సోములయ్య, రామ్మోహన్, నీలకంఠం ఆందోళన వ్యక్తం చేశారు. దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని, ఈ నిర్ణయంతో గిరిజనులకు ఇది అన్యాయం చేసినట్లవుతుందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నిర్ణయంపై రానున్న ఎన్నికల్లో తాము తగిన ప్రణాళికతో ముందుకు వెళ్తామని తెలిపారు.

పోర్టు వాహనం ఢీకొని యువకుడికి గాయాలు

టెక్కలి రూరల్: స్థానిక చేరివీధి నాలుగు రోడ్ల సమీపంలో సోమవారం పోర్టు వాహనంఢీకొని ఎన్టీఆర్‌కాలనీకి చెందిన యువకుడు సదాశివుని వెంకటేష్ గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు... ఎన్టీఆర్ కాలనీకి చెందిన వెంకటేష్ తన ద్విచక్రవాహనంపై పలాస నుంచి టెక్కలి వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో అటుగా వెళ్తున్న మూలపేట పోర్టుకు సంబంధించిన వాహనం ఢీకొనడంతో ఎడమ కాళ్లు వేలు విరిగిపోయాయి. దీంతో వెంకటేష్‌ను స్థానికులు చికిత్స నిమిత్తం స్థానిక జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ-2 కె.రమేష్‌బాబు తెలిపారు.

15 మద్యం సీసాల స్వాధీనం

మెళియాపుట్టి: ఒడిశాలోని పర్లాఖిమిడి నుంచి అక్రమంగా తరలిస్తుండగా 15 మద్యంసీసాలు స్వాధీనం చేసుకుని ఒకరిని వ్యక్తిని అరెస్టుచేసినట్లు ఎస్‌ఐ టి.రాజేష్ తెలిపారు.సోమవారంరాత్రి నందిగాం మండలం అన్నాపురం గ్రామానికి చెందిన గోక మురళీకృష్ణ 15 ఒడిశా మద్యం తీసుకువస్తుండంగా వసుంధర చెక్కపోస్టు వద్ద తనిఖీల్లో భాగంగా పట్టుబడినట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదుచేసి అరెస్టుచేసినట్లు తెలిపారు.

కబ్జాలపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిలో లేదు

● పలాస నియోజకవర్గ జనసేన సమన్వయకర్త దుర్గారావు


18వ వార్డులో ప్రజలతో మాట్లాడుతున్న జనసేన నాయకులు

కాశీబుగ్గ: అక్రమాలు, కబ్జాలపై చూపుతున్న శ్రద్ధ అభివృద్ధిపై చూపడం లేదని పలాస నియోజకవర్గ జనసేన సమన్వయకర్త డాక్టర్ దుర్గారావు దుయ్యబట్టారు. సోమవారం పలాస-కాశీబుగ్గ మునిసి పాలిటీలోని 18వ వార్డులో పలు వీధుల్లో పర్యటించి స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. మునిసిపాలిటీలో కనీస సౌకర్యాలు లేక సమస్యల రాజ్యంగా తయారుచేశారని ఆరోపించారు. వార్డులో సమస్యలపై మునిసిపల్ ఛైర్మన్, కౌన్సిలర్, అధికారులు పట్టించికోవడం లేదని విమర్శించారు. పట్టణం సుందరీకరణకు శ్రీకారం చుట్టిన స్థానిక మంత్రి ప్రజలకు డ్రైనేజీ, రోడ్లు,కరెంటు సౌకర్యం కల్పించడంలో విఫలమయ్యారని ధ్వజమెత్తారు.రోటరీనగర్‌లో కంకరరోడ్లు, బురదమయమైన కాలువలు, అడుగడుగునా చెత్త దర్శనమిస్తున్నామని ఆరోపించారు. సమస్యలు వెంటనే పరిష్కరించి ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించాలని, లేకపోతే జనసేన- టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతామని తెలిపారు. ఆయనతో పాటు జనసేన నాయకులు కోన కృష్ణారావు, హరీష్‌కుమార్, దిలీప్ కుమార్, కిరణ్, దినేష్, బాలు ఉన్నారు.

తిలారు రైల్వేగేటు వద్ద అండర్‌పాస్ పనులు

జలుమూరు: మండలంలోని చిన్నదూగాం కూడలి తిలారు రైల్వేగేటు వద్ద సోమవారం అండర్‌పాస్ పనులు రైల్వే అధికారులు చేపట్టారు. జాతీయరహదారి విస్తరణ పనుల్లో భాగంగా తిలారు రైల్వేగేటు వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు చేపడుతున్నారు. రైల్వే అధికారులు బారీ వాహనాలు తప్ప చిన్నచిన్న వాహనాలు కార్లు, ఆటోలు, ద్విచక్రవాహనాలు వెళ్లడానికి వీలుగా అండర్‌పాస్ పనులు చేపడుతున్నారు. పనులు రెండు వారాల్లో పూర్తిచేసి వాహనచోదకులు అవస్థలులేకుండా ఉండడానికి చర్యలు తీసుకుంటున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. అండర్‌పాస్ పనులు పూర్తయి వాహనాలు రాకపోకలు సాగితే నరసన్నపేట నుంచి పాతపట్నం వెళ్లే వాహనాలకు రైల్వే గేటు కష్టాలు తీరడంతోపాటు సమయం కలిసి వస్తుందని వాహనచోదకులు చెబుతున్నారు.

అదనపు తరగతులు నిర్వహించవద్దు: ఎంఈవో

నరసన్నపేట: ప్రభుత్వ పాఠశాలలకు మంగళవారం నుంచి ఈనెల 18 వరకు సంక్రాంతి సెలవులను ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. దీంతో వసతిగృహాల్లోని విద్యార్థులు స్వగ్రామాలకు బయలుదేరారు. పదోతరగతి విద్యార్థులు సెలవుల్లో అదనపు తరగతులను నిర్వహించరాదని ఎంఈవో శాంతారావు పేర్కొన్నారు. ప్రైవేటు పాఠశాలలు నిబంధనలు పాటించాలన్నారు.

ట్యాప్ లేక.. తాగు నీరు వృథా


నీరు వృథాగా పోతున్న దృశ్యం

పలాస రూరల్: మండలంలోని రంగోయి శివాలయం వద్ద ఏర్పాటు చేసిన మంచినీటి కనెక్షన్‌కు కొళాయి ట్యాప్ లేకపోవడంతో నీరు వృథాగా పోతోంది. గతంతో ఏర్పాటుచేసిన కొళాయి పాడవడంతో గ్రామస్థులు కర్రముక్కను ఏర్పాటు చేసినా ఫలితం ఉండడంలేదు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి కొళాయి ఏర్పాటు చేసి నీటి వృథాను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

పైపులైన్లకోసం రోడ్డు ధ్వంసం

● ఆందోళన వ్యక్తం చేస్తున్న పాతజగదేకపురం కాలనీ వాసులు


పైపులు వేసేందుకు రోడ్డు ధ్వంసం చేసిన దృశ్యం

పలాస రూరల్: గరుడఖండి పంచాయతీ పాతజగదేకపురం కాలనీలో పైపులైన్లు వేసేందుకు రోడ్డును ధ్వంసం చేస్తున్నారని, ఇది సరైన పద్ధతికాదని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. రోడ్లను ధ్వంసం చేసి పైపులైన్లు వేయడం తగదని, ఈ విషయంపై ఇప్పటికే అధికారులకు వినతిపత్రం అందజేశామని తెలిపారు. ఇప్పటికైనా ఇటువంటి పనులు మానుకోవాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు.

శ్రీరాముని అక్షింతల పంపిణీ

కోటబొమ్మాళి: మండలంలోని యలమంచిలిలో అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముని అక్షింతలను రామభక్తులు, గ్రామపెద్దలు కలిసి సోమవారం ఇంటింటికి వెళ్లి పంపిణీచేశారు.కార్యక్రమంలో రామభక్తులు కెల్లి లక్ష్మన్నస్వామి, నారాయణ స్వామి, మెట్ట మన్మథరావుస్వామి పాల్గొన్నారు.

సంక్రాంతి సందడి


ఇచ్ఛాపురం రూరల్: కొలిగాం పాఠశాలలో భోగి మంటలు వేస్తున్న విద్యార్థులు


పొందూరు: మజ్జిలపేటలో..


రణస్థలం: ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థుల వేషధారణ..


కోటబొమ్మాళి: హరిశ్చంద్రపురంలో..


పోలాకి: పిరువాడ పాఠశాలలో..

జిల్లాలోని వివిధ పాఠశాలల్లో సోమవారం సంక్రాంతి సందడి నెలకొంది. మంగళవారం నుంచి పాఠశాలలకు సంక్రాంతి సెలవులు నేపథ్యంలో ఆయా పాఠశాలల్లో విద్యార్థులంతా సందడి చేశారు. భోగి మంటలు వేయడంతో విద్యార్థులు వివిధ వేషధారణలో ఆకట్టుకున్నారు.

- ఆంధ్రజ్యోతి బృందం


టెక్కలి: జ్యోతిబా పూలే బీసీ బాలికల గురుకులంలో..

శ్రీసాయి శిరీష హైస్కూల్‌లో..

కాశీబుగ్గ: భారతదేశం సంస్కృతి, సంప్రదాయాలకు పుట్టినిల్లు అని శ్రీసాయి శిరీష ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ కవిటి భారతి తెలిపారు. సోమవారం కాశీబుగ్గ చినబాడాంలోని ఆ హైస్కూల్ ప్రాంగణంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి సందడి చేశారు. హుకుంపేటలో ఏవీవీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన క్విజ్, వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచి విద్యార్థులను అభినందించారు.


నరసన్నపేట: రెడ్డికపేట పాఠశాలలో గాలి పటాలు వదులుతూ..


కొత్తూరు: సిరుసువాడలో భోగీ మంటలు


పలాస రూరల్: పెదంచలలో సంక్రాంతి సంబరాలు


పోలాకి: అంపలాం ఉన్నత పాఠశాలలో..


జలుమూరు: సంప్రదాయ వస్త్రధారణలో బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు


హిరమండలం: 80 అడుగుల భోగి పిడకల దండతో సవర చొర్లంగి పాఠశాల విద్యార్థులు


సంప్రదాయ వస్త్రధారణలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

దాడిలో ముగ్గురుకి గాయాలు

శ్రీకాకుళం క్రైం: నగర పరిధి మండలవీధిలో సోమవారం జరిగిన దాడిలో ముగ్గురు గాయపడినట్టు ఎస్‌ఐ బలివాడ గణేష్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు. రూరల్ మండలం బలివాడ గ్రామానికి చెందిన పైల సందేష్ ఆదివారం మండల వీధిలో ఉంటున్న తన అన్న ఉమామహేశ్వరరావు ఇంటికి వచ్చాడు. అదే సమయంలో అతని పాత మిత్రుడు రాజు మరికొంత మంది అనవసరంగా గొడవ పెట్టుకుని దాడికి పాల్పడ్డాడు. దీంతో సందేష్‌తోపాటు అన్న ఉమామహేశ్వరరావు, మరో అన్నయ్య సంతోష్ గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం స్థానికులు రిమ్స్‌లో చేర్పించారు. రిమ్స్ ఔట్ పోస్టు పోలీసులు వివరాలు సేకరించి.. వన్ టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

సారా స్వాధీనం

కంచిలి: కేబీ నౌగాం గ్రామ పొలిమేరల్లో అక్రమంగా 30 లీటర్ల సారా తరలిస్తున్న సునీల్ చౌదరి అనే వ్యక్తిని అదుపులోనికి తీసుకున్నట్టు కంచిలి ఎస్‌ఐ సనపల బాలరాజు తెలిపారు. ఒడిశా గొంగాపూర్ నుంచి సారా కావిడితో తరలిస్తుండగా పట్టుకున్నట్టు తెలిపారు.

డ్వాక్రా బజార్‌ను సద్వినియోగం చేసుకోవాలి


పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లఠ్కర్

కలెక్టరేట్: సిక్కోలు డ్వాక్రా బజార్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లఠ్కర్ పిలుపునిచ్చారు. మునిసిపల్ గ్రౌండ్స్‌లో ఈ నెల 3 నుంచి 9వ తేదీ వరకు ఏర్పాటు చేసిన సిక్కోలు డ్వాక్రా బజార్‌ను కలెక్టర్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ వారం రోజుల ప్రదర్శనలో ఏర్పాట్లు, సౌకర్యాలు ఎలా ఉన్నాయని ఆరా తీశారు. స్టాల్స్ అన్నింటినీ పరిశీలించి, వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ విద్యాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

'పోలీసు స్పందన'కు 29 అర్జీలు

శ్రీకాకుళం క్రైం: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీసు స్పందనకు 29 అర్జీలు వచ్చాయి. వీటిలో కుటుంబ తగాదాలపై మూడు, చీటింగ్‌పై రెండు, ఆస్తి తగాదాలపై నాలుగు, పౌర సంబంధమైనవి ఐదు, ఇతర తగాదాలపై 15 ఫిర్యాదులు నమోదయ్యాయి. ఫిర్యాదుదారుల నుంచి అర్జీలు స్వీకరించిన ఎస్పీ రాధిక వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి సంబంధిత స్టేషన్ల ఇన్‌చార్జీలతో మాట్లాడారు. కార్యక్రమంలో ఏఎస్పీలు వీఎస్ మణికంఠ, జె.తిప్పేస్వామి, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

ట్రాఫిక్ సీఐగా బాధ్యతలు


ఎస్పీను కలిసిన సీఐ అవతారం

శ్రీకాకుళం క్రైం: శ్రీకాకుళం ట్రాఫిక్ సీఐగా ఎం.అవతారం సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా విశాఖ సిటీ నుంచి అవతారం ఇక్కడికి బదిలీ అయిన సంగతి తెలిసిందే. 2004 బ్యాచ్‌కు చెందిన అవతారం జిల్లాకు సుపరిచితుడే. జిల్లాలోని కోటబొమ్మాళి, సీతంపేట, పోలాకి మండలాలతోపాటు శ్రీకాకకుళం రూరల్ ఎస్‌ఐగా విధులు నిర్వహించారు. అక్కడి నుంచి విశాఖ సిటీకి బదిలీపై వెళ్లారు. మెరైన్, విశాఖ సిటీ, క్రైం, సీసీఆర్బీల్లో సీఐగా బాధ్యతలు చేపట్టారు. ఇతని స్వస్థలం విజయనగరం జిల్లా వేపాడ మండలం సింగరాయి గ్రామం. అనంతరం ఎస్పీ రాధికను అవతారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు.

యువశక్తితో సామాజిక ఉన్నతి


వివేకానందుడి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

సరుబుజ్జిలి: దేశంలోని యువశక్తి భారతదేశ వికాసానికి, సామాజిక ఉన్నతికి దోహదపడాలని సరుబుజ్జిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల దోహదపడాలని సరుబుజ్జిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.భూషణరావు పిలుపునిచ్చారు. శ్రీశారదా రామకృష్ణ సేవా సమితి సారథ్యంలో నిర్వహిస్తున్న జాతీయ యువజన వారోత్సవాల మూడో రోజు కార్యక్రమం యువతకు స్వామీ వివేకానంద పిలుపు పేరిట కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. అనంతరం వివేకానందుడి విగ్రహానికి పూలమాలలు వేశారు.

వృద్ధుడికి సపర్యలు



శ్రీకాకుళం క్రైం: నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో రెండు రోజులుగా ఓ వృద్ధుడు అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. ఇది గమనించిన స్థానికులు ఆ వృద్ధుడికి సోమవారం సాయంత్రం సపర్యలు చేసి అతడి వివరాలు అడిగి తెలుసుకునే ప్రయత్నం చేశారు. దీనిపై వన్‌టౌన్ పోలీసులకు సచివాలయం సిబ్బంది సమాచా రం ఇవ్వడంతో ఎస్‌ఐ గణేష్ అతనికి భోజనం పెట్టి ఓల్డేజ్ హోమ్‌కు తరలించే చర్యలు చేపట్టారు.

జగన్‌రెడ్డి పాలన సంక్షేమం కాదు.. సంక్షోభం

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్

శ్రీకాకుళం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొనసాగుతున్నది సంక్షేమ పాలన కాదని.. సంక్షోభ రాజ్యం అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ ఎద్దేవా చేశారు. సోమవారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో రైతుకు ఉరి వేశారని, ఇరిగేషన్‌ను బలి చేశారని విమర్శించారు. కౌలు రైతుల ఆత్మహత్యల్లో రెండో స్థానం, రైతు ఆత్మహత్యల్లో మూడో స్థానంలో రాష్ట్రాన్ని నిలిపిన ఘనత జగన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. కాంట్రాక్టర్లే ప్రభుత్వాన్ని బ్లాక్ లిస్టులో పెట్టడం సిగ్గు చేటన్నారు. టీడీపీ రాష్ట్రానికి పరిశ్రమలు తెస్తే, జగన్ మాఫియా తెచ్చాడని విమర్శించారు. అన్ని వర్గాల ప్రజలు, ఉద్యోగులు ఇబ్బందిపడుతున్నారన్నారు. ఉద్యోగ నోటిఫికేషన్లు లేవు, యువతకు ఉద్యోగాలు రావు అన్నారు. 175 అసెంబ్లీ స్థానాల్లో అభ్యర్థులను మార్చినా జగన్‌రెడ్డికి ఓటమి తప్పదన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయకత్వంలో మళ్లీ అధికారం చేపట్టడం ఖాయమని స్పష్టం చేశారు.

అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలి: జేసీ


సమస్యలు తెలుసుకుంటున్న జేసీ నవీన్

కలెక్టరేట్: స్పందనలో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందనలో డీఆర్డీఏ పీడీ విద్యాసాగర్, ఉప కలెక్టర్ జయదేవి, జడ్పీ సీఈవో వెంకటరామన్‌లతో కలిసి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి 273 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల నుంచి వచ్చిన అర్జీలపై అన్ని విభాధిపతులు ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అవయవ దానం చేసిన వీఆర్వో మౌనిక కుటుంబ సభ్యులకు, వెంకటనాయుడు తల్లిదండ్రులకు ఏపీ జీవనదాన్ ధ్రువ పత్రాలను జేసీ ఎం.నవీన్ అందజేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో బి.మీనాక్షి, ఇరిగేషన్ ఎస్ఈ డోల తిరుమలరావు, ఎస్ఎస్ఏ ఏపీసీ జయప్రకాష్, డ్వామా పీడీ చిట్టిరాజు, డీఈవో వెంకటేశ్వరరావు, డీఎస్‌వో వెంకటరమణ, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

జగన్ అసమర్థ పాలన వల్లే రైతులకు నష్టం


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

కవిటి: ముఖ్యమంత్రి జగన్ అసమర్థ పాలన వల్లే రైతులకు తీవ్ర నష్టం కలుగుతుందని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ ఆరోపించారు. సోమవారం రామయ్యపుట్టుగలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో వ్యవసాయాన్ని తిరోగమనంలోకి వైసీపీ ప్రభుత్వం నెట్టేసిందన్నారు. వ్యవసాయశాఖను మూసివేసి ఉద్యానవన రైతులు రోడ్డున పడే విధంగా తయారు చేశారన్నారు. టీడీపీ హయాంలో రాష్ట్రానికి పరిశ్రమలు తెచ్చి ఉపాధి కల్పిస్తే.. జగన్‌రెడ్డి మాఫియాను తెచ్చి ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారన్నారు. యువకులకు ఉపాధి లేకుండా చేసి తాను మాత్రం ఫొటోలు, రంగడులు పిచ్చోడిగా మారాడని దుయ్యపట్టారు. మెడలు వంచి ప్రత్యేక హోదా తీసుకువస్తానని ప్రగల్భాలు పలికి కేసులకై రాజీపడి ముఖ్యమంత్రి హోదాలో మెడలుతిప్పుకొని ప్రజలను మోసగించారన్నారు. చంద్రమోహన్, మణిబాబు, జగ్గారావు, సురేష్, గిరిబాబు పాల్గొన్నారు.

పంట నమోదు తప్పిదంపై విచారణ

జి.సిగడాం: పంటల నమోదులో అధికారుల తప్పిదంపై సోమవారం నిద్దాం గ్రామంలో విచారణ చేపట్టారు. ఖరీఫ్ సమయంలో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించకుండా వరి పంటకు బదులు మొక్కజొన్న సాగుచేసినట్టు ఈ-క్రాప్‌లో నమోదు చేయడంతో తమకు అన్యాయం జరిగిందంటూ ఆ గ్రామానికి చెందిన పలువురు రైతులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో వ్యవసాయాశాఖ ఏడీఏలు వెంకటరావు, శ్రీనివాసరావు, ఏవో శారద గ్రామంలో రైతుల నుంచి వివరాలను సేకరించారు. ఈ-కాప్‌లో అధికారుల అలసత్వం వల్ల తమ ధాన్యం కొనుగోలు చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై నివేదికను ఉన్నతాధికారులకు అందించనున్నట్టు తెలిపారు.

ఎనీమియా వ్యాధిని నిర్మూలించాలి

సరుబుజ్జిలి: సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలనకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఎంపీడీ పీవీ మురళీమోహన్ కుమార్ తెలిపారు. వెన్నెలవలస, బక్కిరిపేట, శ్రీరామ్‌వలస, నందిగూడ గ్రామాల్లో సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి నిర్ధారణ తనిఖీలు చేశారు. అనంతరం కార్యక్రమంపై మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. తనిఖీల్లో పాజిటివ్ వచ్చిన వారికి శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి రిఫర్ చేస్తామని వైద్యాధికారులు సంతోష్ కుమార్, సాహితీ ప్రియాంక వెల్లడించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

'రా.. కదలిరా'ను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న రామ్‌మల్లిక్ నాయుడు

ఎచ్చెర్ల: విజయనగరం జిల్లా బొబ్బిలిలో జరగనున్న 'రా.. కదలిరా' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్ నాయుడు కోరారు. ఎచ్చెర్లలోని నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బొబ్బిలిలో నిర్వహించిన ఈ సమావేశంలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు హాజరవుతారని చెప్పారు. వైసీపీ ప్రభుత్వానికి గ్రాఫ్ పూర్తిగా పడిపోయిందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న నాలుగు మండలాల పార్టీ పరిశీలకులు వజ్జ బాబూరావు, పీరుకట్ల విఠల్, మాదారపు వెంకటేష్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయం ఖాయమని చెప్పారు. టీడీపీతోనే రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తుందన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు బెండు మల్లేశ్వరరావు, ముప్పిడి సురేష్, లంక శ్యామ్, కుమరాపు రవి తదితరులు పాల్గొన్నారు.

పన్నుల వసూలు వేగవంతం చేయాలి

ఇచ్ఛాపురం రూరల్: పంచాయతీల్లో ఇంటి పన్నుల వసూలు వేగవంతం చేయాలని డీఎల్‌పీవో ఇప్పిలి వెంకట రమణ అన్నారు. సోమవారం ఇచ్ఛాపురం ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం భూ హక్కు చట్టం సర్వే ప్రకారం గ్రామంల్లో ఇళ్లకు స్వామిత్వ సర్వే జరిపి ఇంటి యజమానులకు హక్కు పత్రాలు అందించాలని, ఆర్థిక సంఘం నిధులు అభివృద్ధి పనులకు ఖర్చు చేయాలని సూచించారు.

నేటితరం నేతలకు ఆదర్శం.. శ్రీరాములునాయుడు

శ్రీకాకుళం క్రైం: నేటితరం రాజకీయ నేతలకు మాజీ మంత్రి గొర్లె శ్రీరాములు నాయుడు అని తూర్పు కాపు సంక్షేమ సంఘ నాయకులు అన్నారు. శ్రీరాములు నాయుడు 16వ వర్ధంతి సందర్భంగా ఏడురోడ్ల కూడలిలో ఉన్న ఆయన విగ్రహానికి సోమవారం తూర్పుకాపు సంఘ నేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు సురంగి మోహన్‌రావు, నాయకులు పి.జయంతి, అంధవరపు ప్రసాద్, డోల జగన్, పిల్లల సీలాద్రి, గొర్లె లక్ష్మణరావు, రామ కోటి, లంక గాంధీ, వానకృష్ణ చంద్ తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌తో చర్చలు విఫలం

ఆమదాలవలస: మునిసిపాలిటీ పరిధిలో గత 14 రోజులుగా విధులకు హాజరుకాకుండా సమ్మె చేస్తున్న పారిశుధ్య కార్మికులతో సోమవారం కమిషనర్ ఎం.రవిసుధాకర్ జరిపిన చర్చలు విఫలమయ్యాయి. స్థానిక మునిసిపల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికుల సంఘ ప్రతినిధులు కె.సంతోష్‌కుమార్, తారకేశ్వరరావు, శ్రీనివాస్ కొంతమంది నాయకులు పాల్గొన్నారు. కమిషనర్ మునిసిపల్ అధికారులతో చర్చలు నిర్వహించారు. ప్రభుత్వం మునిసిపల్ పరిస్థితి కార్మికుల పరిష్కరిస్తుందని, కార్మికులు విధులకు హాజరుకావాలని కమిషనర్ సుధాకర్ కోరారు. ప్రభుత్వం పరిష్కరించే వరకు సమ్మెను విరమించేది లేదని సంఘ నాయకులు స్పష్టం చేస్తూ అక్కడ నుంచి నిష్క్రమించారు.

మా భూములు ఇప్పించండి


తహసీల్దార్‌కి సమస్య వివరిస్తున్న రైతులు

బూర్జ: మా భూములు ఇప్పించాంటూ లచ్చయ్య పేట గ్రామానికి చెందిన రైతులు మొర పెట్టుకున్నారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ సనపల రమణారావును కలిసి వినతిపత్రాన్ని అందించారు. భూ రీసర్వేలో లచ్చయ్యపేట, సింగన్నపాలెం రెవెన్యూ పరిధిలో ఉన్న సర్వే నెంబరు 22లో సుమారు 56 ఎకరా లు పంట భూమి.. ప్రభుత్వ భూమిగా చూపిస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆ భూములను తాతల కాలం నుంచి సాగుచేస్తున్నామని, వ్యవసాయ రుణాలు కూడా ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. దీనిపై తమసీల్దార్ స్పందించి.. ఈ నెల 10న లచ్చయ్యపేటలో గ్రామసభ నిర్వహించి, సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

గోదాదేవికి పూజలు

శ్రీకాకుళం కల్చరల్: బ్యాంకర్స్ కాలనీలో ఉన్న శివబాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సంతోష్ శర్మ ఆధ్వర్యంలో గోదాదేవి పూజలు నిర్వహించారు. రంగులు, దీపాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.


ఆకట్టుకునేలా దీపాలతో అలంకరణ

సమ్మె మరింత ఉధృతం చేస్తాం

ఆమదాలవలస: తమస సమ్యలు పరిష్కరించకుంటే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని ఆమదాలవలస మునిసిపాలిటీ పారిశుధ్య కార్మికుల సంఘం అధ్యక్షుడు సంతోష్‌కుమార్ హెచ్చరించారు. 14వ రోజు సమ్మెలో భాగంగా సోమవారం సులబ్ కాంప్లెక్స్ వద్ద నిర్వహిస్తున్న నిరసన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కంచకపోవడం దురదృష్టకరమన్నారు. కార్యక్రమంలో సం టఘ నాయకులు తారకేశ్వరరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● ఇచ్ఛాపురం: స్థానిక మునిసిపల్ పారిశుధ్య కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన ఆందోళన సోమవారం కూడా కొనసాగింది ఈ సందర్భంగా డప్పులు మోగించి తమ నిరనలు తెలిపారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.


ఆమదాలవలస: సమ్మె చేస్తున్న పారిశుధ్య కార్మికులు


ఇచ్ఛాపురం: డప్పులు వాయిస్తూ..

ఓటరుగా నమోదు చేసుకోండి

కంచిలి: వయోజనులైన యువతీయువకులంతా ఓటర్లుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ హైమావతి కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కొత్త ఓటర్ల నమోదు, సవరణలు, తొలగింపులకు సంబంధించిన దరఖాస్తులను ఈ నెల 27వ తేదీలోగా తమ పరిధిలోని బీఎల్‌ఓలకు అందజేయాలన్నారు.

సచివాలయ భవనం ప్రారంభం

గార: వాడాడ గ్రామంలో సోమవారం సచివాలయం భవనాన్ని మంత్రి ధర్మాన ప్రసాదరావు ప్రారంభించి, పింఛన్లు పంపిణీ చేసి మాట్లాడారు. దేశంలో ఎక్కడా నెలకు మూడు వేల రూపాయలు పింఛన్ ఇవ్వడం లేదన్నారు. మళ్లీ జగన్‌ను ముఖ్యమంత్రిని చేస్తేనే సంక్షేమ పథకాలన్నీ కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గొండు రఘురామ్, సర్పంచ్ సుంకాన సురేష్, డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

కంచిలి: యూటీఎఫ్ కంచిలి మండల శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ మహిళా దినోత్సవం ఎంఎస్ పల్లి జడ్పీ హైస్కూల్ హెచ్ఎం భాస్కరరావు అధ్యక్షతన ఘనంగా జరిగింది. సోమవారం పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులకు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ అధ్యక్షుడు మురళీనాయక్, ప్రధాన కార్యదర్శి నల్లాన రవి, త్రినాథ్ పాల్గొన్నారు.

ఇద్దివానిపాలెంలో కార్డెన్ సెర్చ్

కవిటి: ఇద్దివానిపాలెం గ్రామంలో సోమవారం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించామని ఎస్ఐ రాము తెలిపారు. ఇచ్ఛాపురం సీఐ ఈశ్వర్ చంద్రప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది కార్డెన్ సెర్చ్ నిర్వహించి, ఈ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు.

అతిథి బోధకుల నియామకానికి ఎంపిక పరీక్ష

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో నాలుగేళ్ల సమీకృత ఉపాధ్యాయ విద్యా కార్యక్రమం (ఐటెప్) కోర్సులో అతిథి బోధకుల నియామకానికి ఎంపిక పరీక్ష ఈ నెల 11న నిర్వహిస్తున్నట్టు వర్సిటీ రిజిస్ట్రార్ బిడ్డిక అడ్డయ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోస్టుల కోసం ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు నిర్దేశించిన తేదీల్లో ఒరిజినల్, రెండు సెట్ల జిరాక్స్ పత్రాలతో హాజరుకావాలన్నారు. అభ్యర్థుల బోధనా తీరును పరిశీలించి అతిథి బోధకులుగా నియమిస్తామన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

కంచిలి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ దేవదాస్ రెడ్డి అధ్యక్షతన సోమవారం సాదాసీదాగా జరిగింది. భూ రీసర్వేలో పలు తప్పులు దొర్లాయని శ్రీరాంపురం ఎంపీటీసీ సభ్యురాలు మాదిన విమల సభ దృష్టికి తీసుకువచ్చారు. తహసీల్దార్ హైమావతి మాట్లాడుతూ.. కొన్ని గ్రామాల్లో ఇలాంటి చిన్న చిన్న తప్పిదాలు ఉన్నాయని, వాటిని సరిదిద్దేందుకు ప్రత్యేక సర్వే బృందం ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. కంచిలి మండలం తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో కరువు మండలంగా ప్రకటించాలని పలువురు సభ్యులు కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు, డీఈ సూర్యప్రకాష్, ప్రత్యేకాహ్వానితులు దుర్గాశి ధర్మారావు, ఎంఈవో శివరాంప్రసాద్, ఏవో ధనుంజయ పాల్గొన్నారు.

కాలిన వరి పంట పరిశీలన

జి.సిగడాం: పెంట గ్రామంలో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో కాలిపోయిన వరి పంటను సోమవారం రెవెన్యూ అధికారులు పరిశీలించారు. బాధిత రైతు కిల్లారి రమణ నుంచి వివరాలను సేకరించారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులకు నివేదించనున్నట్టు వీఆర్వో వేణుగోపాలరావు తెలిపారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ శిబిరం

లావేరు: సంతసీతారాంపురం గ్రామంలో ఈ నెల 2వ తేదీ నుంచి 8వ తేదీ వరకు వ్యవసాయ కళాశాల విద్యార్థులు నిర్వహించిన ఎన్ఎస్ఎస్ కార్యక్రమం సోమవారంతో ముగిసింది. చిన్నయ్యపేట గ్రామ ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించారు. అలాగే రైతుకు వర్మి కంపోస్టు, కూరగాయ విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ కె.మోషా, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ జి.హర్షవర్ధన్ విద్యార్థులు పాల్గొన్నారు.

పెరటికోళ్లు పంపిణీ

రణస్థలం: స్వయంశక్తి సంఘ సభ్యులకు సోమవారం ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ చేతుల మీదగా పెరటి కోళ్లు పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెరటుకోళ్లు నిత్యమూ గుడ్లు పెడతాయిని, ఇంట్లో చిన్నారులకు నిత్యం గుడ్లు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు పిన్నింటి సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేడు జనసేన పార్టీ సమావేశం

శ్రీకాకుళం క్రైం: జనసేన పార్టీ జిల్లా స్థాయి విస్తృత సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్టు ఆ పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లాలో పార్టీ భవిష్యత్ కార్యాచరణ, క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతం, ప్రజా సమస్యలపై పోరాడేందుకు కార్యాచరణ తదితర అంశాలపై సమీక్షించనున్నట్టు తెలిపారు. నగరంలోని 80 అడుగుల రోడ్డులో గల ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే ఈ సమావేశానికి పార్టీ వీర మహిళలు, మండల అధ్యక్షులు, జనసైనికులు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

పార్టీ కో ఆర్డినేటర్‌గా అన్నాజీరావు

ఆమదాలవలస: అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్‌గా సనపల అన్నాజీరావు నియమితులయ్యారు. ఇటీవల విడుదలైన పార్లమెంట్ నియో జకవర్గ ఇన్‌చార్జీల జాబితాలో అన్నాజీరావును నియమిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల కోసం ప్రణాళికా బద్ధంగా వ్యవహరిస్తామన్నారు. కాంగ్రెస్ గెలుపునకు కలిసికట్టుగా పనిచేస్తామన్నారు.

స్వయం సమృద్ధి సాధించాలి

ఆమదాలవలస: ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాల ఆర్థిక లబ్ధితో మహిళా స్వయంసహాయక సంఘాల సభ్యులు సమృద్ధి సాధించాలని మెప్మా జిల్లా సంస్థాగత బలోపేత నిపుణులు బి.రామారావు అన్నారు. మునిసిపల్ కార్యాలయంలో పట్టణ, సమాఖ్యల ఆర్‌పీలకు మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బ్యాంకు లింకేజీ, జీవనోపాదులు, సామాజిక భద్రతా బలోపేత నిపుణులు ఎస్.వెంకటరావు, బి.భాస్కరరావు, విజయకుమారి, సిబ్బంది రాజేష్‌కుమార్, నాగమణి, అమ్మినాయుడు, ఆర్పీలు పాల్గొన్నారు.

చంద్రశేఖరేంద్ర సరస్వతి ఆరాధన

శ్రీకాకుళం కల్చరల్: ఉపనిస్మందిరంలో చంద్రశేఖరేంద్ర సరస్వతి ఆరాధనా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిష్టల నర్సింహమూర్తి ప్రవచనాలు నిర్వహించారు. కార్యక్రమంలో గుమ్మా నగేష్, కామేశ్వరరావు, జి.విశ్వేశ్వరరావు, ఈశ్వరరావు, తవుడు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.